"మన వూరు వచ్చిందమ్మా!" తండ్రి పిలుపు రైలు కుదుపు ఒకేసారి రాధని ఆలోచనల్లోంచి తట్టి లేపాయి.

దిగవల్సిన చోటు, చిననాట మమతలు ఎదలో ముడివేసుకున్న చోటు. చకచకా రైలు దిగుతుంటే గుండెల అంచులపై ఉద్వేగం తొణికింది. తనూలత చిత్రంగా వణికింది.

"నెమ్మది. నెమ్మది ..." అన్నాడు సుబ్బారావు.

రాధ నవ్వింది. "ఇంక నాకేం భయంలేదు నాన్నా!"

ఆమె చకచకా స్టేషను బయటకు నడుస్తుంటే సుబ్బారావు ఆశ్చర్యంగా చూసాడు. మూడు నెలలనాడు చావుబ్రతుకుల మధ్య వూగిసలాడుతూ వెల్లూరు హాస్పిటల్‌లో ఘంచాని కతుక్కుపోయిన ఆ అర్భకురాలికి - ఇప్పుడు మెఱుపు తీగలా కదలిపోయే ఈ చైతన్యమూర్తికి ఎంత తేడా?

"నాకేమిటో ఇదంతా కొత్త కొత్తగా వుంది నాన్నా!"

"నువ్వు మన వూరు చూసి పదేళ్ళు పైనే అయింది. మరి కొత్తగా వుండదూ?"

అబ్బ, పదేళ్ళు అయిందా? ఇన్నేళ్ళు ఇక్కడికి రాకుండా ఎలా వుండగలిగింది?

"అందులో పునర్జన్మ ఎత్తి నడుస్తున్నావు. నీకంతా కొత్తగా వుండటం సహజమే!"

నిజమే! పునర్జన్మ ఎత్తి రాగలిగింది కనుకనే తన వూరు రాగలుగుతోంది! గతంలో తనకిప్పుడున్నంత చొరవ, అవకాశం ఉండేవా అసలు?

సుబ్బారావు రిక్షా మాట్లాడాడు.

"మా వూరికి ఒక్కసారి తీసుకువెళ్ళండి ... అని ఆయన్ని ఎన్నోసార్లడిగాను. ఒక్కటంటే ఒక్కసారి ఆయన నా కోరిక తీర్చలేదు. పుట్టి పెరిగిన వూరు చూడాలని ఎవరికుండదు?"

"నాది కూడా కొంతవరకూ తప్పేనమ్మా! తెల్సినా నీ కోరిక నేనూ తీర్చలేదు."

తండ్రి వైపు చిత్రంగా చూసింది రాధ. తన కోరిక తీర్చనందుకు తండ్రి ఇప్పుడు బాధపడుతున్నాడా? ఏ కోరిక? ఈ వూరికి తీసుకురాలేక పోయినందుకా? తన మనసుపడిన సుధాకర్‌కిచ్చి పెళ్ళి చెయ్యలేక పోయినందుకా?

'అసలీ దేశంలో ఆడపిల్లలకి కోరికలంటూ వుంటాయని పెద్దవాళ్ళు గుర్తించటమే ఒక వింత! అవి తీర్చటం మరింత వింత! ... నువ్వూ అందరిలాంటి తండ్రివే నాన్నా!' అని అందామనుకుంది రాధ. తండ్రి నొచ్చుకుంటాడని వూరుకుంది.

"ఈ మాటు మా వూరు వెళ్ళొస్తానంటే ఆయన అడ్డుపెట్టలేదు. బహుశ, నా మీద చచ్చి బతికానని జాలిపడ్డ కాబోలు!"

"ఎందుకమ్మా అంత మాటంటావు? నువ్వు జబ్బుచేసి మంచాన పడివుంటే ఆనంద్ ఎంత బాధపడ్డాడో .."

తండ్రి మాటలకి అడ్డు వచ్చింది రాధ. "ఆయన బాధపడలేదని నేనన్నానా నాన్నా ... ఆయనేమిటి ... మా అత్తగారు మామగారు, మరిది, ఆడపడుచులు అంతా బాధపడ్డారు. మా పక్కింటివాళ్ళు బాధపడ్డారు. ఆయన ఆఫీసులో వాళ్ళు బాధపడ్డారు. డాక్టర్లు బాధపడ్డారు. నర్సులు బాధపడ్డారు. చివరికి కిడ్నీలు రెండూ చెడిపోయి నా కూతురు మృత్యుముఖంలో వుంది - ఎవరయినా దయయుంచి ఒక కిడ్నీ దానం చేయండి ... అని నువ్వు న్యూసుపేపరు అడ్వర్టయిజుమెంటు యిస్తే - ఆ వార్త కంపోజ్ చేసినవాడూ బాధపడే వుంటాడు. ఆ వార్త చదివినవాళ్ళూ బాధపడే వుంటారు! ... లోకం కోసం బాధపడటం వేరు. లోకానికి భయపడి బాధపడటం వేరు. జాలితో బాధపడటం వేరు. ప్రేమాభిమానాలతో బాధపడటం వేరు. కాదంటావా నాన్నా!"

సుబ్బారావు నిరుత్తరుడయ్యాడు. "అంత మాటనకమ్మా! ఆనంద్ నీ కోసం చాలా బాధపడ్డాడు."

తనకోసం తన భర్త నిజంగా అంత బాధపడ్డాడా? రోజుల తరబడి పేకాట క్లబ్బులో కాలక్షేపం, రాత్రిళ్ళు ప్రొద్దుపోయి యింటికి రావటం, తన కిష్టమయినప్పుడు మీద చేయి వెయ్యటం - కోరిక తీరగానే ప్రాణంలేని బొమ్మని విసిరినట్టు విదిలించి పారేయటమే కాని - తన భార్యా ఒక మనిషే, ఆమెకు ఒక వ్యక్తిత్వమూ, ఒక హృదయమూ - అందులో చిన్నవే అయినా కొన్ని తీపి తీపి కోరికలంటూ ఉంటాయని గ్రహించకపోవటం .. ఇవే కాని మరొక రకమయిన అనుభవాలు తన భర్తనుంచి తానెప్పుడూ ఎరుగదే! ... తను ఒంటరిగా ఉన్నప్పుడు ఇంకా సుధాకర్‌ని తల్చుకుంటోందంటే ... అతనితో గడిపిన చిన్ననాటి రోజుల్ని మర్చిపోలేక పోతోందంటే దానికి కారణం ఎవ్వరు? తన మొగుడు తనవాడు



# ఆర్ముగం

విమలారామం

కాగలిగినప్పుడు కదా - సుధాకర్ తనకు పరాయి మగాడిగా అనిపించగలిగేది?" ...ఆయనకి నా మీద ఎంతో ప్రేమాభిమానాలున్నాయని నువ్వు చెప్పే వరకు నాకు తెలియకపోవటం నిజంగా నా దురదృష్టం నాన్నా!" అంది.



"నువ్వలాగంటే ఇంక నేనేం చెప్పగలనమ్మా!" అన్నాడు సుబ్బారావు నిరుత్సాహంగా.

తండ్రి చేతిమీద తన చేయి వేసింది రాధ. "వదిన నగలు అమ్మించావు. అన్నయ్య బ్యాంకు అక్కౌంట్లు ఖాళీ చేయించావు. చివరకు మనకంటూ మిగిలిన మన మామిడితోటని అమ్మటానిక్కూడా సిద్ధపడ్డావు. వేలకు వేలు నా వైద్యం కోసం ఖర్చుపెట్టావు ..."

"కన్నబిడ్డ కోసం చేయడంలో గొప్పేముందమ్మా!"

రాధ కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి. "ఆ మృత్యుముఖం ఘడియల్లో నాకింకా బ్రతకాలన్న కోరిక ఎందుకు మిగిలిందంటే అది నీ మూలంగానే! నాకేదయినా అయితే నువ్వెంత గుండె చెఱువు చేసుకొంటావో అన్న భయంచేతనే! కాని, ఒక్కటి చెప్పు నాన్నా -నేనూ నువ్వూ ఎంత కోరుకున్నా ... ఆర్ముగం అనే దేవుడు దిగిరాకపోతే, నేనీ క్షణంలో ఇంకా బ్రతికి వుండేదాన్నా?"

"అవునమ్మా! ఆర్ముగం నిజంగా దేవుడు ..."

కాని, అటువంటి ఆర్ముగం గురించి తన భర్త ... అత్తవారు ఎంత నీచంగా వూహించారు!

తన అన్నా, వదినలు తనకు కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడ్డారు. కాని, పరీక్షలుచేసి వాళ్ళవి సరిపోవటం లేదని నిర్ధారించారు డాక్టర్లు. తన తండ్రిది సరిపోయింది కాని - పెద్ద వయస్సులో ఆపరేషనుకు తట్టుకోలేడని డాక్టర్లు వద్దన్నారు. అదక్కముందే తన భర్త ... తన అత్తవారింట్లో ఎవరో ఒకరు ముందుకు రావల్సింది. తన తండ్రి నోరు తెరిచి అడిగితే కనీసం పరీక్షలు చేయించుకోటానిక్కూడా ఎవ్వరూ ముందుకు రాలేదు. ఏదో ఒక వంక పెట్టి అంతా తలొక వైపు తప్పించుకున్నారు. వాళ్ళు చేసిన, మహోపకారం ఒక్కటే - పత్రికల్లో ప్రకటన వేయండి - ఎవరయినా కిడ్నీ దానం చెయ్యవచ్చుని సలహా యివ్వటం!

తన తండ్రికి చివరి ఆశ ... తన పాలిట వరమూ అయింది! పత్రికల ద్వారా తన దీన పరిస్థితి దేశంలో ఎంతో మందికి తెల్సివచ్చింది. ఎన్నో జాలి గుండెల్ని కదలించి వేసింది. అపరిచితులయిన సహృదయులెందరో తన 'డయాలిసిస్' ఖర్చులు, విజయవాడకి - వెల్లూరురికి మధ్య దారి ఖర్చులు భరించి తనకు మరికొన్నాళ్ళు ఆయుష్షు పోసారు!

చివరికోనాడు తన ప్రాణదాత 'ఆర్ముగం' ప్రత్యక్షమయ్యాడు. తనకు స్పృహ వచ్చాక తనకు పునర్జన్మ ప్రసాదించిన ఆ మహోన్నత వ్యక్తిని గురించి తండ్రి మంచి మాటలు చెపుతున్నప్పుడు - ఆ మంచి మనిషిని తానొకసారి చూడాలని ఉత్సాహపడుతున్న వేళ "నేను చెప్పలేదూ - పేపర్లో ప్రకటన వేస్తే కిడ్నీ అమ్ముకునే వాళ్ళెవరో ఒకరు దొరుకుతార"ని - అదంతా తన గొప్పతనమేనన్నట్లు మాట్లాడారు తన మామగారు. తన మనస్సు అప్పుడెంత చివుక్కుమందో - కనీసం తన భర్తయినా గ్రహిస్తాడేమోనని అతని కళ్ళల్లోకి చూసింది. కాని, తన ఆశ నిరాశే అయింది.

అన్నాళ్ళుగా పడిన ఆవేదనకిక తట్టుకోలేక "పరాయివాడు పదివేలకే ఒప్పుకున్నాడు ముప్పయివేలు ఖరీదుచేసే మామిడితోట రాసిస్తామంటే అయినవాళ్ళల్లో ఒక్కళ్ళు కూడా ముందుకు రాలేదేమండీ!" అన్నాడు తన అన్నయ్య వ్యంగ్యంగా. 'మంచి మర్యాదా లేని మనుషులు' అని అత్తగారు తన పుట్టింటి వారినంతా దుమ్మెత్తిపోసింది.

'పేషెంటు ముందు మీరిలాంటి మాటలు మాట్లాడతారేమిటి?" అని నర్సు అందర్ని కేకలేసింది. అక్కడ్నించి అంతా వెళ్ళిపోయాక 'వాళ్ళ మాటలకి బాధపడకమ్మా!' అని తండ్రి తన నోదార్చబోతే తనకు నవ్వు వచ్చింది.

"నేను దేవుడితో దెబ్బలాడి మళ్ళీ బ్రతికినదాన్ని. నాకివో లెక్కా నాన్నా!" అని కావాలనే పెద్దగా నవ్వింది.

తనకప్పుడూ - యిప్పుడూ ఉన్నది ఒక్కటే కోరిక - తన ప్రాణదాతని ఒక్కసారి చూడాలని - తన ధర్మంగా తన కృతజ్ఞత లందించాలని!

'అతనికి ఆపరేషనయింది కదమ్మా! అతనిప్పుడెలా రాగలడు?' అన్నాడు తండ్రి ఆవేళ. మరో వారం పోయాక.... తను లేచి కూర్చోగల శక్తిని పుంజుకున్నాక 'పోనీ, నేనే వచ్చి ఒకసారి ఆయన్ని చూస్తా న్నాన్నా' అని లేవబోయింది. అప్పుడే డాక్టరు రావటం. 'మీ ప్రాణదాత* థాంక్సు చెప్పటానికి ముందు ముందు చాల రోజులున్నాయి. కాని, ముందు మా ప్రాణాలు తీయకు తల్లీ!" అని తమిళ డాక్టరు తెలుగులోనే మందలించటం జరిగింది.

తనే మనసుండబట్టలేక పలుమార్లు అతనేమంటున్నాడని అడిగింది. "ఏమంటాడమ్మా? నాది తెలుగుమాట. అతనిది తమిళం..... ఇద్దర్కీ యింగ్లీషు సరిగారాదు. మద్రాసు వాడుకదా– నేను మాట్లాడే తెలుగు మాట మాత్రం అతని కర్థమవుతోందిట!" అని నవ్వాడు తండ్రి.

తన కెంతో సంతోషమయింది. అతను తన దగ్గరికి వచ్చినప్పుడు తన మాటలు అతని కర్థమవుతాయి– అది చాలని తృప్తి పడింది. కాని, మరో మూడు నాల్గు రోజులు గడిచినా అతను రాలేదు. ఓ రోజున నర్సుని పిల్చి 'మీకు తెలుగు చదవటం వచ్చా' అని తానడిగింది. కొద్దిగా తెల్సునంది నర్సు సిగ్గుపడుతూ. "ఆర్ముగం గారికి యింగ్లీషు రాదు. నాకు తమిళం రాదు. ఆయనకి థేంక్సు చెపుతూ తెలుగులో రాసాను. కాస్త ఈ చీటీ ఆయన దగ్గరకి తీసుకువెళ్ళి నేనేంరాసానో తమిళంలోకి తర్జుమా చేసి చెపుతారా?" అని అడిగింది. నర్సు తను కోరినట్టే చేసింది. తమిళంలో రాసినా ఏదోటి అతను రాసి పంపితే తనకి చాలని పించింది. కాని అతనేమి పంపించలేదు. తాను పంపించిన చెటీనిమాత్రం పదేపదే చదివాడట. తను ఆశ్చర్య పోయింది. " అదే, చదివినట్టు అటూ ఇటూ చూసాడు.' అని నర్సు నవ్వింది. 'ఇంకేమి అనలేదా' అని తానడిగింది. 'మీరు చెప్పమన్నది చెప్పాను.

రొంబ థేంక్సు – అని చెప్పమన్నాడు.' అంది నర్సు.

'చీటీ రాసిస్తాడేమోనని–అడక్కపోయారా' అని తనెలా అడుగుతుంది! నేడో రేపో అతనే తన దగ్గరకి వస్తాడని అప్పటికి సరిపెట్టుకుంది! .... కాని, తన మనస్సుకి చివుక్కు మనిపించేలా ఆ మర్నాడే ఎవరికీ చెప్పకుండా హాస్పటలు నుంచి అతను వెళ్ళిపోయాడు!

తన కేడుపొచ్చింది. "నేనేం తప్పు చేసానని నన్ను చూడకుండా ఆయనలా వెళ్ళిపోయారు నాన్నా!" అని తాను బాధపడింది.

'నువ్వేం తప్పు చేయలేదమ్మా! తప్పంటూ చేసుంటే అది నేనే చేసాను.' అని జరిగిందేదో తండ్రి చెప్పకు వచ్చాడు. 'మీ మాట మీరు నిలబెట్టుకున్నారు. నాబిడ్డప్రాణం కాపాడారు. ఇక నామాట నేను నిలబెట్టుకోవాలి. మీకిస్తానన్న పది వేలు రేపిస్తాను. కేషు తెమ్మంటారా– డ్రాఫ్టు కావాలా' అని అంత క్రితం రాత్రి తండ్రి అర్ముగాన్ని అడిగాడట. అతను కన్నీళ్ళు పెట్టుకొని తల అడ్డంగా తిప్పితే అతని ఉద్దేశ్యం అర్థంకాలేదు తన తండ్రికి. పైగా అపార్థం చేసుకొని డాక్టరు గారి దగ్గరికి వెళ్ళి 'అతనింకా డబ్బుకి ఎక్కువ ఆశ పడుతున్నట్టున్నాడండి. నేనింతకంటే యింక యివ్వలేను. కొంచెం మీరు చెప్పండి.' అని చెప్పాడు. దాంతో డాక్టరుగారూ తప్పుగా అర్థం చేసుకొని తన తండ్రి మాటల్నే ఆయనా వల్లి వేసివచ్చారు. 'నేను తోటి మనిషికదా అని నేనివ్వగలిగింది నేనిచ్చానే కాని అమ్ముకోటం లేదుసార్' అని డాక్టరుతో ఆవేశంగా అన్నాడట అర్ముగం. డాక్టరుగారు కూడ అతని మాటల్ని అపార్థం చేసుకున్నారు. ' సర్సరే, నువ్విమ్వగలిగింది నువ్విచ్చావు. వాళ్ళివ్వగల్గింది వాళ్ళిస్తున్నారు. సంతోషంగా పుచ్చుకొని వెళ్ళు.' అని డాక్టరు గారు చెప్పి వెళ్ళిపోయారట!.... అంతే, ఆ రాత్రికి రాత్రే హాస్పటలు నుంచి ఎవరికీ తెలియకుండ వెళ్ళిపోయాడు ఆర్ముగం!

'దానమంటే నిజంగా దానమే చేసాడు. కాని, అతను కిడ్నీని అమ్ముకోలేదు.' అని తన తండ్రి ఎన్నిసార్లు చెప్పినా తన అత్తవారు ఆయన మాటల్ని నమ్మలేదు. తన తండ్రి చాటుగా డబ్బిచ్చి అతన్ని పంపించేసాడట. అత్తింటి వారిని పది మందిలో ఎద్దేవా చేయాలని – ఆ పరాయివాడెవరో దానం చేసాడని – అందరితోను చెప్పకుంటున్నాడట! 'వింటున్నారా మీ వాళ్ళ మాటలు' ! అని తానంటే '.... కాళ్ళ దగ్గరికి వచ్చిన డబ్బుని కాదనే వాళ్ళుంటారా ఈ లోకంలో.' అని వ్యంగ్యంగా నవ్వాడు తన భర్త.

ఇదీ తన భర్త సంస్కారం! తను మృత్యు ముఖంలో ఉన్నప్పుడు అతనెంతో బాధపడి పోయాడని తన పిచ్చి తండ్రి ఇప్పటికీ నమ్ముతున్నాడు!

తన భర్తకి తన మీద ప్రేమ ఇదివరకు వుందా– ఇప్పుడు ఉంటోందా– ఇక ముందు ఉంటుందా– అన్న మీమాంసలో లేదిప్పుడు ఆమె మనస్సు.

'అర్ముగం' తనని చూడకుండ ఎందుకలా వెళ్ళి పోయాడు?– అదే ప్రశ్న పదే పదే ఆమె కెదురవుతోంది?

హాస్పటల్లోని అతని అడ్రసు సంపాదించి ఎవరో తమిళం తెల్సున్న వాళ్ళ చేత రెండుమూడు ఉత్తరాలు రాయించింది. అయినా అతన్నుంచి జవాబు లేదు. పైగా ఉత్తరాలు తిరిగి వెనక్కి వచ్చాయి.

'ఒక సారి నువ్వు వెళ్ళి చూసిరా అన్నయ్యా'అని తన అన్నగార్ని మద్రాసు పంపించింది. అలాంటి పేరున్న వాళ్ళు గాని– అలాంటి గుర్తులున్న వాళ్ళు కాని ఆ అడ్రసు వున్న చోట ఎవ్వరూ లేరుట! తను ఆశ్చర్యపోయింది– 'అర్ముగం' అన్న మనిషి లేనేలేడా? తనకు ప్రాణదానం చేసింది 'అర్ముగం' అన్నది అభూత కల్పనా? మరి తండ్రీ , అన్నా .... చివరకి తన భర్తా అంతా అతన్ని చూసారే! నర్సు తను రాసిచ్చిన చీటీ తీసుకువెళ్ళి అతనికిచ్చి వచ్చిందే! మరి తానొక్కతే చూడకూడ నంత పాపం తానేం చేసిందని..... అతనలా వెళ్ళిపోయాడు?తప్పు చిరునామా యివ్వవచ్చిన అవసరం అతనికే మొచ్చింది? ఇంత గుప్తదానం చేయవల్సిన అగత్యం అతనికేం కలిగింది? తన ప్రాణదాతకి కృతజ్ఞత చెప్పకోలేక పోవటం తనకు ప్రాణ సంకటంగా వుంది యిప్పుడు ! తన మనసులోని వేదన అతనికి తెలియజెప్పగల శక్తి ఈ లోకంలో ఎక్కడయినా వుందా?.....

రిక్షావాడు మువ్వలు మోయించటంతో ఆలోచనల్లోంచి బయటపడింది రాధ. "అప్పుడే వూళ్ళోకి వచ్చేసామా?" అంది.

"అవునమ్మా! ఇప్పుడూళ్ళోకి కంకర్రోడ్డు వేసారు. స్టేషన్నించి ప్రయాణం అరగంటకన్న ఎక్కువ పట్టదు." అన్నాడు సుబ్బారావు.

రిక్షా మువ్వల చప్పుడికి తోడు ఆమె గుండెలు లయబద్ధంగా జిల్లుమంటున్నాయి. చిన్ననాటి స్మృతులు ఒక్కసారి ఉవ్వెత్తున లేచి వస్తున్నాయి.

"అది..... అది మనయిల్లు కదూ!" అంది రాధ.

"అవునమ్మా!" అన్నాడు సుబ్బారావు ముక్తసరిగా.

"నాపెళ్ళికోసం అమ్మేయక పోతే అది యిప్పటికీ మనిల్లుగానే వుండేది."

"అదేంమాటమ్మా! మనం పట్నంలో అన్నయ్య దగ్గరికి వెళ్ళి పోయాము కదాని......"


పట్నం వెళ్ళిపోయిన వాళ్ళంతా వున్నవూళ్ళోని యిళ్ళమ్మేసుకుంటున్నారా?..... ఆ మాట అంటే తండ్రి బాధపడతాడని వూరుకుంది రాధ. పుట్టి పెరిగిన వూరితో సంబంధాలు త్రెంచుకోవాలని తాననుకోలేదు. తన సుధాకర్ అనుకోలేదు. ఈ వూళ్ళోనే వుండా మనుకున్నారు.

అతనిది చదువూ పెద్దది కాదు. ఉద్యోగమూ పెద్దది కాదు. అయినా ఉన్న వూళ్ళో ఉద్యోగం దొరికింది కదాని ఎంతో సంబరపడి పోయారు. ఉన్నంతలో సంతృప్తిపడి బ్రతుకుదా మనుకున్నారు.

తమ అనుబంధానికి తన వాళ్ళ ఆదరణ లభించి వుంటే ఇప్పటికి తనూ, సుధా ఆ యింట్లో వుంటూవుండే వారేమో! అతని తలపులతో ఆమె గుండె జల్లుమంది. కళ్ళు చెమిరాయి.

వేణుగోపాలుడి గుడి దగ్గర తనే రిక్షాని ఆపమంది రాధ.

ఇటీవల హర్యానా రాష్ట్రంలోని అంబాలా కంటోన్మెంట్‌లో అంబాలా తెలుగు సాంస్కృతిక సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నాటక, పాటల, ఏకపాత్రాభినయ, మిమిక్రీ, భరతనాట్యం పోటీలలో పాల్గొన్న తెలుగు కళాకారులని చిత్రంలో చూడవచ్చు.



# గుప్తాగ్ని

-సోమసుందర్

పంజాబుకు నవోదయం
కలిగించిన బర్నాలా!
భారతీయ హృదయపూర్ణ
శుభాశంస లివే నీకు...
ఆగామికి రహదారి
సమకూర్చిన బర్నాలా!
అభినందన చందనాల
నందు కోవె మహోదయా!

కంటకాలు కీటకాలు
నిండిన ఈ బాట నడక. .
గుప్తాగ్నుల కొరవులతో
భయపెట్టే ప్రేత భూమి...
మైత్రీ హిత వాక్కులతో
హెచ్చరికల నంద చేతు–
సదా చేతన ధ్వజమై
సాగవలయు మునుముందుకు!

పరలో దాగిన కత్తులు
త్వరలో తల లెత్తునేమొ?
ఎరమింగిన మత్తులోని
త్రాచులు పడగెత్తునేమొ?
సమరం లేకుండుట – అది
శాంతి కాదు ఎన్నటికి!
శ్మశాన నిశ్శబ్దం – అది
శాంతి కాదు, భ్రాంతి తప్ప!

సామరస్య సౌహార్దం
సౌజన్యం సుమబంధం!
అదే నేటి నరుల నడుమ
వాంఛనీయ వాత్సల్యం!
ప్రక్కనె పొంచిన శత్రువు
ఘాతుకాల ప్రేరేపణ –
రక్తదాహ పిశువులకు
శాంతి ప్రాణసంకటమే!

హో షియార్ బర్నాలా!
నవచరణాంకిత పథమిది..
అహరహ జాగృతి, పురోగతి–
అజ్ఞానంపై ధ్వజమిది..
సర్వత్రా విష ఝుంఝులు
గర్వాంధ నిశాచ రాళి...
మానవతా పరమ శత్రు
సమూహాల వ్యూహకేళి..

నిశిత శాత పరీక్షతో
పరిమార్చక ప్రగతి లేదు
నరరూప పిశాచపాళి
కూల్చక చిరశాంతి రాదు!
ఆదిమత్వ కూట నీతి
గుప్తాగ్నులు సుప్తార్చులు
మానవ జాతి నిరోధులు
హోషియార్ బర్నాలా!

# ఆర్ముగం

"మాస్టారింటికి వెళ్ళి మళ్ళీ వచ్చేవాళ్ళం కదమ్మా!" అన్నాడు సుబ్బారావు.

"ముందు దేవుడికి దండం పెట్టుకొని వెళ్ళాలని వుంది నాన్నా!"

సుబ్బారావు కొబ్బరికాయ తీసుకు రావటానికి కిరాణా కొట్టు వైపు వెళ్ళాడు.

గుళ్ళోకి నడిచింది రాధ. ధ్వజ స్తంభం మీద చేయివేసి అట్టే నిలబడి పోయింది. గాలి వీచింది. చిరు గంటలు మ్రోగాయి. రాధకి గుండె గొంతుకలోకి వచ్చినట్టయింది....

ఆ రాత్రి యిక్కడే నిలబడి సుధాకర్ తనకి మాట యిచ్చాడు.... "ఒక్క రెండేళ్ళు ఎలాగో ఓపిక పట్టు. నేను మంచి ఉద్యోగం సంపాదించుకు వస్తాను. మీ వాళ్ళని సంతృప్తి పరిచాకనే నిన్ను పెళ్ళి చేసుకుంటాను. మీ అమ్మగారు కోరినట్టు పట్నంలోనే కాపురం పెడదాము.... నన్ను నమ్ము."

తను నమ్మింది. వెళ్ళినవాడు వెళ్ళి వూరుకో లేదు. తన నింకా నమ్మించాలని గుడి దగ్గర చెప్పిన మాటలే ఉత్తరంలో రాసి పంపించాడు. అదే తనకు ప్రాణ సంకట మవుతుందని తెల్సుంటే సుధ అంత పని చేసివుండేవాడు కాదు!

తల్లి కళ్ళబడింది ఆ వుత్తరం. తండ్రితో పోరి యావత్తు కాపరాన్ని పట్నానికి తరలించింది. ఎలాగయినా సుధాకర్ పెట్టిన గడువు దాటాలని తన ఆరాటన. ఆలోగా పెళ్ళి చేసేయాలని తన తల్లి తొందర. చదువుకుంటాను ఇప్పుడప్పుడే పెళ్ళి వద్దని తను. చదివి వుద్యోగాలు చేయాలా పెళ్ళి చేసుకోమని తల్లి, అన్నగారి సహకారంతో చదువు వంకన ఆ రెండేళ్ళూ ఎలాగో గడప గలిగింది. ఆపైన సుధాకర్ కోరిన గడువుతీరి ఆర్నెల్లూ గడిచి పోయాయి. ఇంక తనకు తల్లిదండ్రుల్ని ప్రతిఘటించి పెళ్ళికి వాయిదా వేసే శక్తి పోయింది.... ఇచ్ఛా పోయింది!

ఆ తర్వాత తనకు ఆనంద్‌తో.... తల్లి కోరిన పట్నవాసపు టల్లుడితో పెళ్ళయి పోయింది. ఈ దేశంలో అనేక మంది ఆడపిల్లల్లాగునే తనకు జీవితంతో రాజీపడక తప్ప లేదు!

కాని, తర్వాత ఆనంద్‌తోటి దాంపత్యం సుధాకర్‌ని మరిపించటానికి బదులు అతన్ని నిత్యం గుర్తుంచుకునే దుస్థితికి తీసుకు వెళ్ళింది. సుధ యిలా చేసేవాడా– సుధ యిలా అనేవాడా– అని భర్తతో పోల్చుకోని రోజు లేకుండా పోయింది. చివరికి ఒక్కసారి సుధాకర్ వచ్చి తనతో నాల్గు మాటలు మాట్లాడి వెడితే చాలు మరికొన్నేళ్ళు బ్రతగ్గల శక్తి వస్తుందేమో– అని తాననుకునే పరిస్థితికి దిగజారి పోయింది తన జీవితం.

కాని, తనకా కోరికా తీరలేదు. గడువుదాటి రెండు కాదు.... పదేళ్ళు దాటిపోయినా సుధాకర్ తనని చూడటానికి రాలేదు! ఎందుకు రాలేదో, ఎక్కడ వున్నాడో, ఎలా వున్నాడో తనకు తెలియదు. తమ ప్రేమనిలా ఎందుకపహాస్యం కానిచ్చాడో తన కంతు పట్టటం లేదు. మగవాడు! తానే వచ్చి చూడకపోతే ఆడది– అస్వతంత్రురాలు తాను వెతుక్కుంటూ ఎక్కడికి వెళ్ళి చూడగలదు? ఇంకీ జీవితంలో మళ్ళీ అతన్ని చూడలేదేమో తను!....

నిరాశతో నిండిన జీవితంతో గడుపుతున్న తనకు అనారోగ్యం కూడ తోడయింది. అది చివరకి తనను మృత్యు ముఖం దాకా తీసుకు వెళ్ళింది. "ఆర్ముగం" అన్న వ్యక్తి తనని ఆదుకోక పోయివుంటే.... ఈ క్షణంలో సుధాకర్ స్మృతులతో ఇక్కడ యిలా నిలబడ గలిగి వుండేదా?....

"ఇదిగో నమ్మా కొబ్బరి కాయ." అన్నాడు సుబ్బారావు.

గుడివైపు నడిచింది రాధ. గుడి తలుపులు వేసి వున్నాయి.

"ఈవేళప్పుడు పూజారిగారుండడు!" అన్నాడు సుబ్బారావు.

ఈ జీవితంలో తనకు కావాలని పించినప్పుడు తన కేదేవుడు అందుతున్నాడు కనుక!" "ఫర్వాలేదు నాన్నా!...." అని గుడి గుమ్మంలోనే కొబ్బరికాయ కొట్టింది.

మరో పది నిమిషాల్లో గమ్యం చేరుకుంది రిక్షా.

"నమస్కారం మాస్టారూ!" అంది రిక్షా దిగిన రాధ.

"రామ్మారా!" అని ఎదురు వచ్చారు సుందరం మాష్టారు.

"పునర్జన్మ ఎత్తి వచ్చావుట. నిన్ను చూడాలని ప్రాణాలు కళ్ళల్లో పెట్టుకొని కూర్చున్నానే తల్లీ!" అంటూ శాంతమ్మగారు కావలించుకొని కన్నీళ్ళు పెట్టుకుంది.

"ప్రసాదం తీసుకోండి."

"అయ్యయ్యో, ఎంత చిక్కిపోయావే తల్లీ!"

"మిమ్మల్ని చూడాలని నాతో పట్టు పట్టి వచ్చింది." అన్నాడు సుబ్బారావు.

"మరి కొన్నాళ్ళు రెస్టు తీసుకున్నాక రాక పోయావామ్మా!" అన్నారు మాస్టారు.

"మిమ్మల్ని, పిన్నిగార్ని ఈవూర్ని చూసాక... ఇంకా నాకు రెస్టు అవసరమంటారా మాస్టారూ!" అని గలగల నవ్వింది రాధ.

ఆ తర్వాత ఆమె ఒక్కటే కబుర్లు.... రైలు దిగినప్పట్నుంచి నిరుత్సాహంగా వున్నది అంత అధాత్తుగా ఆమె యిన్ని కబుర్లెలా చెప్పగలుగుతోంది? ఆమెకింత శక్తి ఎక్కడ్నించి వచ్చింది?.... సుబ్బారావు ఆశ్చర్యపోతున్నాడు.

"మీ అమ్మ యిప్పుడు బ్రతికి వుంటే నిన్ను చూసి ఎంత సంతోషపడి వుండేదో!" అంది శాంతమ్మ.

ఏరికోరి ఆనంద్‌తో సంబంధం చేసిన తన తల్లి తన కూతురి జీవితం ఎలా అవస్థలు పాలయిందో తెలియక ముందే ఇహలోకం విడిచి వెళ్ళి పోయింది. పరలోకంలో వుంది, సంతోష పడుతోందో ఇహలోకంలో వుంటే ఆనందపడి వుండేదో తానిప్పుడు చెప్ప లేదు. ఎట్టెదుట శాంతమ్మగారు తనను చూసి ఆనందపడుతోంది – అది చాలు తనకి. ఆ మాటే పైకి అంది రాధ.

"నీ అభిమానం.... నువ్వు ఏమి మారలేదు." అంది ఆవిడ సంబరపడిపోతూ.


"కబుర్లేనా! కాస్త కాఫీలు సంగతి కూడా చూడు...." అన్నారు మాస్టారు.


"అరే, నా మతి మండిపోను." అంటూ ఆవిడ లేచింది రాధ ఆవిడ్ని వెన్నంటి వెళ్ళింది.

మాస్టారడిగాడు. వెల్లూరులో రాధ ఎలా పునర్జన్మ ఎత్తి వచ్చిందో చెప్పుకుంటూ వచ్చాడు సుబ్బారావు. ".... ఆ అదృగం ఎవరోగాని మాస్టారూ! అతని ధర్మమా అని మామిడితోట అమ్మ వల్సిన అవసరం రాలేదు. బజానా డబ్బు తిరిగిచ్చేద్దామనే నేనిప్పుడు వచ్చాను."

మరి కాసేపటికి శాంతమ్మగారు రాధని వెంట బెట్టుకొని వంటింట్లోంచి బయటకు వచ్చింది. అంతవరకూ కబుర్లలో వుండి అట్నే గంభీరంగా వుండిపోయారేమిటా అని రాధ చిత్రంగా చూసింది.

"ఇదిగో వింటున్నారా? రాధ ఏదో అడుగుతోంది!"




అంది ఆవిడ.

"ఏమిటి?" మాస్టారడిగారు.

"బుచ్చిరాజుగారి సుధాకర్ యిప్పుడెక్కడున్నాడు – అతనికి పెళ్ళయిందా– పిల్లలెంత మంది.... ఆఁవటా అని అడుగుతోంది."

"ఏమని చెప్పను?" అన్నాడాయన సుబ్బారావు చూస్తూ.

రాధ గతుక్కుమంది. "అదేమిటి మాస్టారూ! అతనీ పదేళ్ళల్లోనూ మన వూరెప్పుడూ రాలేదా?"

"ఇది చదువమ్మా!...." తండ్రి గొంతు జీర పోయిందెందుకో.... అధాత్తుగా లేచి వీధి అరుగుమీద కెందుకు వెళ్ళిపోయాడో అర్థంకాక.... వెల వెల బోతూ ఆయన అందించిన కాగితం మడత నందుకుంది రాధ!

ఆమె గుండెల్ని గగుర్పాటుతో జల్లు జల్లుమని పిస్తుండగా ఆమె కళ్ళు ఆ కాగితంలోని అక్షరాల మీద వరవడి పెట్టాయి. అతి పరిచయమయిన ఆ అక్షరాలు ఆమె గుండె కుదుళ్ళని కదలిస్తుండగా ఆమె చదవ సాగింది.

మాస్టారూ!

మీ కిలాంటి ఉత్తరం రాయవల్సి వస్తుందని నేనీ జీవితంలో ఎప్పుడూ అనుకోలేదు. ఈ క్షణంలో నా సంతోషాన్ని పంచుకునే ఆత్మీయులు మీరు తప్ప నాకీ లోకంలో ఎవ్వరూ లేరు. అందుకే మీకిది రాస్తున్నా.

మన రాధకి గండం గడిచింది మాస్టారూ! ఆపరేషను సలక్షణంగా జరిగి పోయింది. ఇప్పుడు కులాసాగా వుంది. ఈ శుభ వార్త మీరు వింటే ఎంతో సంతోషిస్తారని నాకు తెల్సు. అందుకే ఇది రాస్తున్నా.

మాస్టారూ! ఒంటరివాడ్ని. ఈ జీవితంలో నాతో సుఖ దుఃఖాలు పంచుకొనే వాళ్ళెవరూ లేరు నాకు. అయినా, మీరు నాయందు చూపించిన ఆత్మీయత కొద్దీ నా గురించి మీతో ఎంతో చెప్పుకోవాలని వుంది. ఇప్పుడు రాలేని పరిస్థితిలో వున్నాను. అందాకా ఆపుకోలేక నా గురించి ఈ మాటలు రాస్తున్నా.

మీకు తెల్సునో తెలియదో రాధా నేనూ పదేళ్ళ క్రితమే పెళ్ళి చేసుకుందా మనుకున్నాము. వాళ్ళ వాళ్ళకి ఆ సంగతి తెల్సు. ఇందులో రహస్య మేమీలేదు. నా కయిన వాళ్ళెవరూ లేరు. పెద్ద ఉద్యోగం లేదు. ఆస్తిపాస్తులు లేవు. రాధని ఏం సుఖ పెట్టగలనని వాళ్ళ భయం. నాతో పెళ్ళి చేసి రాధని కష్టాలుపాలు చేయటం యిష్టం లేదన్నారు వాళ్ళు. లోకంలో ఏ తల్లిదండ్రు లయినా అదే మాట అంటారు. అది సహజం. కాని, రాధ తిన్నాకనే నేను తిందామను కున్నాను. రాధని సుఖపెట్టడానికి ప్రపంచంలో ఎటువంటి బరువు లెత్తటాని కయినా సిద్ధ పడదా మనుకున్నాను. రాధ నాకు ప్రాణం.... నా ప్రాణం కంటె ఎక్కువగా చూసుకుంటాను.... అని చెప్పాను. ఒక్క రెండేళ్ళు గడు వివ్వండి– ఒక మంచి ఉద్యోగం సంపాదించుకొని వస్తాను అని చెప్పి బయలు దేరి వెళ్ళాను. ఎక్కడెక్కడ ఎన్ని ప్రయత్నాలు చేసానో– ఎన్ని అవస్థలు పడ్డానో యిప్పుడు చెప్పనూలేను. చెప్పి ప్రయోజనమూ లేదు. కాని, ఆఫీసర్ని కాకపోయినా నాకంటూ ఒక మంచి ఉద్యోగం సంపాదించుకొనే సరికి రెండున్నర సంవత్సరాలు పట్టింది!....

కాని, నాదురదృష్ట వశాత్తు, నేను వచ్చేటప్పటికి ఒక నెలముందే రాధకి పెళ్ళయిపోయిందట! నేను మాట నిలబెట్టుకో లేక పోయానని రాధ ఎంత నిరాశపడివుంటుందో– ఆ ఆలోచన భరించలేక పోయాను. ఆమె కొక్కసారి క్షమాపణ చెప్పుకుంటే కాని నాకు శాంతి కలుగదు. రాధ అడ్రసు తెల్సుకోటానికని వాళ్ళ వాళ్ళింటికి వెళ్ళాను.

"ఇప్పుడేం ముఖం పెట్టుకొని వచ్చావు? నీ కోసం ఎంతో ఎదురు చూసి పెళ్ళి చేసుకుంది రాధ. ఇప్పుడు రాధకి నువ్వంటే అసహ్యం!" అన్నారు వాళ్ళమ్మగారు. రాధ పెళ్ళిఫోటో తెచ్చి చూపించారు. వాళ్ళు సుఖంగా వున్నారు. ఇప్పుడు నువ్వక్కడికి వెళ్ళి లేనిపోని అనుమానాలు పుట్టిస్తావా! రాధ మీద నీకున్న ప్రేమయిదేనా' అన్నారావిడ. నిజమేననిపించింది. ప్రేమించిన వాళ్ళని యిబ్బందుల్లో పెడతారా ఎవరయినా! రాధ యిప్పుడు నాది కాదు. పరాయిసొత్తు. పలకరించటం కూడ తప్పేకావచ్చు.

అందుకని గుండె రాయి చేసుకొని తిరిగి వెళ్ళిపోయాను. తిరిగి మనవూరు రావాలని నా కనిపించలేదు. రాధ లేని చోటికి రావాలని పించలేదు. మళ్ళీ వస్తానని అనుకోనూ లేదు.

కాని, ఆ రేళ్ళ తర్వాత రాధ పేరు పేపర్లో చూసే సరికి నా గుండె గుభేల్మంది. నమ్మలేక పోయాను. అది నిజంకాకూడదని ఆశిస్తూ మన వూరు వచ్చాను. కాని, అది నిజమేనని మీరు చెప్పాక నా ప్రాణాలు

ఆదా చేయండి రు. 11 లు.

పోస్టుద్వారా భారతి తెప్పించుకోండి!

ఆఫ్‌సెట్ ముద్రణతో భారతి మాస పత్రిక...

"భారతి" మాసపత్రిక యిప్పుడు అనేక మార్పులతో కొత్త ఆకర్షణలతో వెలువడుతోంది. సాహిత్యం,కవిత్వంతో పాటు భారతిలో యెక్కువ మంది పాఠకులు కోరే విధంగా కథలు, సీరియల్స్ అధిక సంఖ్యలో నే యిప్పుడు చోటు చేసుకుంటున్నవి. ఈ మార్పును మీరు గమనించే వుంటారని ఆశిస్తున్నాము.

భారతి సంవత్సర చందా (పోస్టు ద్వారా రు. 51/–లు) ఒకేసారి చెల్లించే వారికి రు. 11/–ల 'ముదరా' వుంటుంది

అంటే మీరు కేవలం రు. 40/–లు చెల్లిస్తే ప్రతినెలా భారతి పోస్టు ద్వారా మీ ఇంటికే అందుతుంది

ఈ అవకాశమును మా పాఠకులు, సాహిత్యాభిమానులు విరివిగా వుపయోగించుకొనగలరు.

చందా సైకమును ఆంధ్రపత్రిక, గాంధినగరం, విజయవాడ–3కి మనియార్డరు లేదా డిమాండు డ్రాఫ్టు ద్వారా పంపుతూ ఈ దిగువ కూపను జతపర్చ కోరుతాము.

అయ్యా,

నేను 'భారతి' మాసపత్రికకు చందాదారునిగా చేరదలుచుకున్నాను చందా సైకము రు. 40/– డి.డి. / ఎం. ఒ. ద్వారా పంపుతున్నాను.

పేరు : ______________________

ఇంటి నెం : ______________________

ఊరు : ______________________

చందాదారుని సంతకం



బాలరంజని

పిల్లల సచిత్ర మాస పత్రిక



వినోదానికి కథలు, సీరియల్సు,విజ్ఞానానికి వివిధ శీర్షికలు, ప్రతి పేజిలో రంగుల బొమ్మలు పిల్లలను, పెద్దలనురంజింప చేసే 'బాలరంజని' తప్పక చదవండి.


# ఆర్యగం

గిలగిల లాడిపోయాయి.

రాధని పోగొట్టుకొని ఎలా యింత కాలం బ్రతగ్గలిగానా అని నాకప్పుడప్పుడూ అనిపించేది. ఈ వ్యర్ధ మయిన బ్రతుక్కి ముగింపు పలుకుదామా అని కూడా అనిపించేది. ఏదో తెలియదు– ఏదో శక్తి నన్నిలా యింతకాలం బ్రతకనిచ్చింది.

ఇప్పుడు నాకెంతో ఆనందంగావుంది మాస్టారూ! వ్యర్థ మనుకున్న నాజీవితానికో అర్థం యిన్నాళ్ళకి కనిపించింది. రాధ కేమి చేయలేక పోయాననుకున్నాను ఇన్నాళ్ళూ! రాధ కావాలంటే నా ప్రాణాలన్నీ పట్టి పిండి యివ్వాలని పించేది. అటువంటి నారాధ ప్రాణాపాయ స్థితిలో వుంటే నేను భరించగలనా?

వెల్లూరు వెళ్ళాను. సుబ్బారావు గార్ని కల్సుకున్నాను. ఆయన్ని చూసే సరికి రాధ వాళ్ళమ్మగారన్న మాటలు గుర్తొచ్చాయి. రాధకి నేనంటే అసహ్యమన్నారావిడ. నిజమా? ఏమో– నిజమో కాదో కనుక్కునే అవకాశం నాకులేదు. అప్పుడవసరమూ అనిపించలేదు. రాధకి ఎవరు కిడ్నీ దానం చేస్తున్నారో తెలియవల్సిన అవసరం ఉందా? లేదు...... రాధ బ్రతకాలి. అక్షణంలో నా కోరికా అదే! అనిపించిందీ అదే! ..... అందుకే, నేను సిద్ధబడ్డాను.

నాగెడ్డమూ అదీ చూసి సుబ్బారావుగారు నన్ను గుర్తుపట్టక పోవటం మంచిదయింది. నా తమిళం మాట విని ఎవరో అరవ్వాడిననుకున్నారాయన.

కాని, రాధ నన్ను చూడాలని వుందని సుబ్బారావు చెప్పారు. రాధ స్వయంగా నాకుత్తరమే రాసి నర్సు ద్వారా పంపించింది..... పిచ్చి రాధ నాగురించి తెలియక తెలుగునుంచి తమిళంలోకి తర్జుమా చేయమని నర్సుతో చెప్పిందిట! అప్పుడు నర్సు పడిన అవస్థ చూస్తే ఇప్పటికీ నాకు నవ్వాగదు!

అయితే, రాధ ఆశిస్తున్నట్టు నేనెదురుపడితే ఏమంటుంధి? అందరితో పాటు తనూ నన్ను గుర్తు పట్టదని భ్రమపడలేను నేను. ఎన్నేళ్ళు గడిచినా ఎన్ని వేషాలు వేసినా– భాష మార్చినా రాధ నన్నిట్టే గుర్తు పట్టేస్తుంది! కాని, నిజంగా వాళ్ళమ్మగారన్నట్టు– నా మీద రాధ కింకా అసహ్యమే ఉంటే నేను అందించింది అమృతం కాదు– విషమయిపోతుంది. అలాంటి బాధ నేనసలే భరించలేను

అంతకన్న అజ్ఞాతంగా ఆమె జీవితంలోంచి తప్పుకోవటమే మంచిదని నిన్ననే ఎవరికీ తెలియకుండ హాస్పటలునించి వచ్చేసాను. రాత్రి వచ్చే సే ముందు రాధ గదిలోకి వెళ్ళి చూసి వచ్చాను. హాయిగా నిద్రపోతోంది. ఆమె తిరిగి ప్రపంచంలో పడింది. ఈ జీవితానికా తృప్తి చాలు.

అందుకే నిశ్శబ్దంగా తిరిగి వచ్చేసాను.

రాధ కులాసాగా వుందని శాంతమ్మగారికి చెప్పండి ఆవిడా ఆనందపడతారు. మీకూ– ఆవిడకి నా నమస్సులు

–సుధాకర్!